RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 297 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 30 ఏప్రిల్ 2024 పేజీలు : 4 వెల : 2/-



## బాబ్బాబు చేర్చుకోండి

### కాంగ్రెస్‌లో చేరేందుకు 25 మంది ఎమ్మెల్సీలు సిద్ధం!

### అధికార పార్టీ లీడర్లతో టచ్‌లో ఉంటూ మంతనాలు!!

హైదరాబాద్ : ఓ వైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు కాంగ్రెస్‌లో చేరుతుండగా, మరోవైపు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు సైతం పార్టీ మారేందుకు సిద్ధమైనట్టు ప్రచారం జరుగుతున్నది. ఎప్పుడంటే అప్పుడు పార్టీ కండువా కప్పుకుంటామని సంకేతాలు ఇస్తున్నట్టు తెలుస్తున్నది. ఆలస్యం చేయకుండా, పార్లమెంట్ ఎన్నికల లోపు చేరికల ప్రక్రియను పూర్తి చేయాలని రిక్వెస్టులు పెడుతున్నట్టు సమాచారం. పెద్దల సభలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు కేవలం ముగ్గురు మాత్రమే ఉండగా, బీఆర్ఎస్ పార్టీకి సుమారు 28 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. వీరిలో మెజారిటీ సభ్యులు పార్టీ మారేందుకు రెడీగా ఉన్నట్టు తెలుస్తున్నది.

**చేర్చుకోవాలని ఒత్తిళ్లు...** తమ పార్టీలోకి రావాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై రూలింగ్ పార్టీ ఒత్తిడి పెట్టడం సహజం. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీల విషయంలో సీన్ రివర్స్ అయ్యింది. పార్టీ మారేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, వెంటనే చేర్చుకోవాలని గులాబీ ఎమ్మెల్సీలు ఒత్తిడి పెడుతున్నట్టు సమాచారం. తమకు సన్నిహితంగా ఉండే మంత్రులు,ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి చేరికల ప్రతిపాదనలను పదే పదే ప్రస్తావిస్తున్నట్టు తెలిసింది. అయితే ఎమ్మెల్సీల చేరికల విషయంలో ఓ ప్లాన్‌తో ఉన్నామని ఓ సీనియర్ మంత్రి వెల్లడించారు. "ముందు అసెంబ్లీలో 26 మంది ఎమ్మెల్యేలను చేర్చుకోవడం తమ టార్గెట్. ఆ తర్వాత ఎమ్మెల్సీలపై ఫోకస్ పెడుతాం." అని వివరించారు.

**ఎక్కువ మంది మూలాలు కాంగ్రెస్‌వే....** పెద్దల సభలో కాంగ్రెస్ పార్టీకి 28 మంది ఎమ్మెల్సీలు ఉండగా, అందులో మెజార్టీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారే ఉన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా పనిచేశారు. కానీ రాష్ట్ర విభజన తర్వాత

## కారు పార్టీకి ఇది గట్టి దెబ్బే!

అప్పటి రాజకీయ కారణాల వల్ల గులాబీ పార్టీలోకి వెళ్లారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన మండలి సమావేశంలో చాలా మంది ఎమ్మెల్సీలు జోష్‌గా కనిపించారు. అప్పటి నుంచే పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నామని సంకేతాలు ఇస్తున్నట్టు తెలిసింది.

**విలీనానికి 20 మంది ఎమ్మెల్సీలు...** 20 మంది ఎమ్మెల్సీల మద్దతు ఉంటే, శాసన మండలిలో బీఆర్ఎస్ ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం కావొచ్చు. అప్పుడు పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. ప్రస్తుతం పార్టీ మారేందుకు 20 నుంచి 25 మంది ఎమ్మెల్సీలు రెడీగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఇంత మందిని పోగు చేయడంలో కీలక పదవుల్లో ఉన్న ఒకరిద్దరు ఎమ్మెల్సీల కృషి ఉన్నట్టు టాక్ ఉంది.

ఘర్ వాపస్ కోసం కొన్ని రోజులుగా ఇతర ఎమ్మెల్సీలను ఒప్పించి, సక్సెస్ అయినట్టు తెలుస్తున్నది.

## మెదక్ సీటుపై రేవంత్ రెడ్డి ఫోకస్.. ఎందుకంటే..?



మెదక్ పార్లమెంట్ స్థానం అధికార కాంగ్రెస్ కి కొరకరానికొయ్యలా మారింది. కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయం అనుకునే స్థానం, లేదా కాంగ్రెస్ కి చుక్కలు చూపించే స్థానం మెదక్ అని తేలిపోయింది. అందుకే ఈ పార్లమెంట్ సీటుపై సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. తాజాగా ఆయన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ప్రచార ప్రణాళికలు రూపొందించి ప్రజల్లోకి వెళ్లాలని, పోలింగ్ బూత్ స్థాయి నుంచే ఓట్లు వేయించుకునే వ్యూహంతో ముందుకెళ్లాలని స్థానిక నేతలకు సూచించారు రేవంత్ రెడ్డి. పార్లమెంటు ఎన్నికల తరవాత స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయని, పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలంటే ముందు పార్లమెంటు ఎన్నికల్లో బలం నిరూపించుకోవాలని ఉపదేశించారు.

**మెదక్ లో కాంగ్రెస్ కి చేదు అనుభవం.. మెదక్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే అసెంబ్లీ స్థానాలు 7 – కాంగ్రెస్ గెలిచినవి 1 – బీఆర్ఎస్ ఖాతాలో ఉన్నవి 6...** ఈ ఈక్వేషన్లు చూస్తే ఇక్కడ ఎవరి బలం ఎంతో ఈజీగా తేలిపోతుంది. కానీ లోక్ సభ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ని ఎలాగైనా బలహీనం చేసి ఆ మెదక్ సీటు కాస్తా తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. మెదక్ లో బీఆర్ఎస్ ని ఓడిస్తే.. హరీష్ రావుని కూడా దెబ్బకొట్టినట్టు అవుతుందనేది ఆయన ఆలోచన. గతంలో మెదక్ నుంచి కేసీఆర్ కూడా ఎంపీగా ఎన్నికయ్యారు. గతంలో ఇదే పార్లమెంట్ స్థానం నుంచి ఇందిరా గాంధీ కూడా గెలిచారు. అందుకే ఇది హాట్ సీట్ గా మారింది.

మెదక్ లోక్ సభ స్థానానికి కాంగ్రెస్ తరపున నీలం మధు పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యేగా గెలవడంతో.. ఆయన స్థానంలో వెంకట్రామిరెడ్డిని బరిలో దింపారు కేసీఆర్. ఈ రెండు పార్టీల మధ్య పోరు ఆసక్తికరంగా మారింది. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకి గెలిచే అవకాశం లేకపోయినా ఓట్లు గణనీయంగా చీల్చ గలరు. దీంతో కాంగ్రెస్ ఈ సీటుపై మరింత ఫోకస్ పెట్టింది. మెదక్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ గెలిచింది అనుకున్నా.. అక్కడ బీఆర్ఎస్ ని తక్కువ అంచనా వేయలేం. అంటే మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ బలంగా ఉంది. పటాన్ చెరు, సంగారెడ్డిలో బీజేపీకి కూడా ఓటుబ్యాంకు ఉంది. దీంతో మెదక్ సీటు కాంగ్రెస్ కి కీలకంగా మారింది. మెదక్ పరిధిలోని నేతలంతా ఈ ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేయాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. రాష్ట్రంలో అమలు చేస్తున్న కాంగ్రెస్ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఐదుగురు నేతలతో సమన్వయ కమిటీని ఏర్పాటుచేసుకోవాలని చెప్పారు. మొత్తమ్మీద ఈసారి మెదక్ సీటుపై ప్రత్యేకంగా సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెంచారు.



## నేడు పదో తరగతి ఫలితాలు..

హైదరాబాద్: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ఫలితాల విడుదలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 30న ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేయనున్నారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ https://results.bsetelangana.org/ చూసుకోవచ్చు. ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 2,57,952 మంది బాలురు, 2,50,433 మంది బాలికలు ఉన్నారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను ఏప్రిల్ 13 నాటికి పూర్తిచేశారు.



## టెక్ హబ్‌ను ట్యాంకర్ హబ్‌గా మార్చారు

### కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం

బాగల్‌కోట్: ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలుచేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపిస్తూనే అలా జరగనివ్వనని ఉద్ఘాటించారు. ఎస్సీ/ఎస్టీ, ఓబీసీలు భాజపా వైపు ఉన్నందున మైనార్టీలను బుజ్జగించాలని హస్తం పార్టీ చూస్తోందన్నారు. కర్ణాటకలోని బాగల్‌కోట్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ఆయన.. స్థానిక అధికార ప్రభుత్వం స్వల్ప కాలంలోనే రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని విమర్శించారు. "కర్ణాటకలో వెనకబడిన వర్గాల హక్కులను కాలరాసి రాజ్యాంగాన్ని మార్చే ప్రచారాన్ని కాంగ్రెస్ ప్రారంభించింది. మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు రాజ్యాంగం అంగీకరించదు. కానీ, కర్ణాటక ప్రభుత్వం మాత్రం ఓబీసీ రిజర్వేషన్లలో కొంత భాగాన్ని ముస్లింలకు కేటాయించింది. ఈతరహా రిజర్వేషన్ల కల్పనకు చట్టం తీసుకువస్తామని గతంలో పేర్కొన్న కాంగ్రెస్.. ఈసారి మ్యానిఫెస్టోలోనూ అటువంటి సంకేతాలే ఇస్తోంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఏదేమైనా ఆ పార్టీ ప్రయత్నాలను ఫలించనివ్వనన్నారు. మీ హక్కులు, రిజర్వేషన్లు కాపాడేందుకు ఎంతవరకైనా వెళ్తానని.. దళితులు, ఆదివాసీ, ఓబీసీలకు ఇదే నా గ్యారంటీ అని హామీ ఇచ్చారు.




## గాంధీ భవన్‌కు ఢిల్లీ పోలీసులు.. సీఎం రేవంత్‌రెడ్డికి సమన్లు..!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షాకు సంబంధించిన ఫేక్ వీడియోల కేసులో రేవంత్‌కు పోలీసులు ఈ సమన్లు అందించారు. మే 1న విచారణకు ఢిల్లీకి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన ఉపయోగించిన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌ను సైతం విచారణకు తీసుకురావాలన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు చేరుకున్న ఢిల్లీ పోలీసులు సమన్లు అందజేశారు. హోం మంత్రిత్వ శాఖ, బీజేపీ పార్టీ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేవంత్‌కు పోలీసులు సమన్లు పంపడం చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ పోలీసుల ప్రత్యేక బృందం ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇదిలా ఉండగా.. అమిత్ షా ఇటీవల తెలంగాణ పర్యటించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ప్రసంగిస్తూ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ విరుద్ధమైన ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీకు చెందిన ఆ హక్కులను తిరిగి వారికే ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, షా ప్రసంగాన్ని పలువురు వక్రీకరించి.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పినట్లు ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరోవైపు ఫేక్ వీడియోపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సైతం స్పందించింది. ఈ మేరకు నకిలీ వీడియోలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. హోంశాఖ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపింది. అదే సమయంలో ఈ వ్యవహారంలో పలు రాష్ట్రాల్లోనూ కేసులు నమోదయ్యాయి.



## నిన్నటి వరకు సీబీఐ, ఈడీ.. ఇప్పుడు ఢిల్లీ పోలీసులు: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: అమిత్‌షా వీడియో మార్ఫింగ్ వ్యవహారంలో తనతోపాటు పలువురికి ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇవ్వడంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు.

భాజపాపై పోరాడే వారికి అమిత్‌షా నోటీసులు పంపిస్తున్నారని విమర్శించారు. భాజపాను ప్రశ్నించినందుకే తమకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. మోదీ ఇప్పటి వరకు విపక్షాలపై సీబీఐ, ఈడీని ప్రయోగించారని, ఎన్నికల్లో గెలిచేందుకు ఇప్పుడు ఢిల్లీ పోలీసులనూ ప్రయోగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇక్కడ ఎవరూ భయపడేవాళ్లు లేరన్న సీఎం రేవంత్.. తెలంగాణ, కర్ణాటకల్లో భాజపాను ఓడించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.


## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# గులాబీ పార్టీకి మల్లారెడ్డి శకునిలా మారారా?

అంత పెద్ద గుమ్మడికాయ సైతం కత్తిపీటకు లోకువే అన్నట్లుగా.. కొందరు నేతలు ఆయా పార్టీ అధినేతలకు ఒక పట్టాన అంతుచిక్కని రీతిలో వ్యవహరిస్తుంటారు. మిగిలిన నేతల్ని.. లక్షలాదిగాఉండే ఫాలో యర్స్ ను సైతం కంట్రోల్ చేసే సత్తా ఉన్న అధినేతలు సైతం.. కొందరు నేతల విషయం లో కాస్తంత తగ్గి ఉంటారు. అందుకు గులాబీ బాస్ కేసీఆర్ సైతం మినహాయింపు కాదంటారు. తన రాజకీయ ప్రత్యర్థులకు సైతం ఒక పట్టాన అంతుచిక్కని విధంగా ఉండే కేసీఆర్.. సొంత పార్టీకి చెందిన మాజీ మంత్రి.. మేడ్చల్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న మల్లారెడ్డి విషయంలో మాత్రం కిందా మీదా పడుతుంటారు. ఆయన నోటి నుంచి వచ్చే వ్యాఖ్యల్ని చూస్తూ.. కామ్ గా ఉండటం అసాధ్యం. అలా అని ఆయన మీద వేటు వేసే ధైర్యం లేని పరిస్థితి. ఇలాంటి సిత్రమైన సీన్ ఒక్క మల్లారెడ్డికి మాత్రమే సాధ్యమని చెప్పాలి. తాజాగా ఒక పెళ్లి వేడుకలో ఎదురు పడ్డ ఈటల రాజేందర్ ను అప్యాయంగా పలుకరించిన మల్లారెడ్డి.. పనిలో పనిగా నువ్వే గెలుస్తున్నావ్ అన్నా.. అంటూ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారటం తెలిసిందే. కీలకమైన ఎన్నికల్లో.. గెలుపు కోసం కిందా మీదా పడుతూ.. ఈ ఎన్నికల్లో ఉనికి చాటకుంటే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే ఇబ్బందిని గులాబీ పార్టీ ఎదుర్కొంటోంది. ఇలాంటి వేళ.. సొంత పార్టీ అభ్యర్థిని వదిలేసి.. ప్రత్యర్థి పార్టీకి చెందిన ఈటల రాజేందర్ ను ఉద్దేశించి మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు తెర తీశాయని చెప్పాలి. మల్లారెడ్డి నోటి నుంచి ఎప్పుడు ఎలాంటి మాట వస్తుందో అర్థం కాని పరిస్థితి. ఆయన చేతలు సైతం సిత్రంగా ఉంటాయి. ఆ మధ్యన కర్ణాటక రాజధాని బెంగళూరుకు వెళ్లిన మలారెడ్డి.. ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం ను కలవటం.. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకోవటం తెలిసిందే. అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల అభ్యంతరంతో ఆయన హస్తం గూటికి చేరే ప్రయత్నాలు మధ్యలో ఆగిపోయాయి. ఇలా.. తరచూ గులాబీ బాస్ కు.. గులాబీ పార్టీకి ధమ్కీలు ఇచ్చే సత్తా ఒక్క మల్లారెడ్డికి మాత్రమే సొంతమని చెబుతున్నారు. ఇంతజరిగినా.. ఆయనపై చర్యలు తీసుకునేంత సీన్ గులాబీ బాస్ కు సైతం లేదంటున్నారు. గతంలో అయితే ఆయన ఒక్కరే ఉండేవారు. ఇప్పుడు ఆయనతో పాటు.. ఆయన సొంత అల్లుడు కూడా మల్కాజిగిరి ఎమ్మెల్యేగా ఉండటం తెలిసిందే. ఒకే కుటుంబంలో ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేల్ని వదులుకునేంత లగ్జరీ బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు లేదన్నది నిజం. అందుకే.. పంటి కింద రాయిలా ఉండే మల్లారెడ్డి మాటల్ని భరించుకుంటూ ఉండటమే తప్పించి.. మరింకేమీ చేయలేరన్న మాట గులాబీ తోటలో ఆసక్తికర చర్చగా మారింది. ఏమైనా.. మల్లారెడ్డి సుడే సుడిగా పలువురు అభివర్ణిస్తున్నారు. అందరికి ఏదోలా ధమ్కీలు ఇచ్చే కేసీఆర్ కే.. రివర్సులో ధమ్కీ ఇచ్చే ఒకే ఒక్కడు మల్లారెడ్డి అన్న మాటలు గులాబీ నేతల నోటి నుంచి అనధికారికంగా రావటం గమనార్హం.

# సాంకేతికత.. సమస్త చరిత




గోదావరిఖని : ఆధునిక సాంకేతికత సాయంతో ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎన్నికల సంఘం పౌరులందరికీ అందుబాటులోకి తెస్తోంది. భారత ఎన్నికల సంఘం, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో ఈ మేరకు పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. వివిధ సామాజిక మాధ్యమాల్లోనూ సంబంధిత వెబ్‌సైట్ల లింకులు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎన్నికల నిర్వహణ తీరును ప్రజలకు అందుబాటులో తేవాలన్న లక్ష్యంతో ప్రత్యేక మొబైల్ యాప్‌లను రూపొందించింది.

విజిలేస్తే అక్రమాల ఆటకట్టుఎన్నికల్లో అక్రమాలను నేరుగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు 'సి-విజిల్' యాప్ ఉపయోగపడుతుంది. ఫొటోలు, వీడియోలు, ఆడియోలు సహా చేసే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకునేలా ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ప్రలోభాల పంపిణీ, ప్రజల ఆస్తుల ధ్వంసం, కుల మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు, అసత్య ప్రచారాలు, ఓటర్లను బెదిరించడం, మారణాయుధాలు కలిగి ఉండటం, ఓటర్ల రవాణా తదితర అంశాలపై 'సి-విజిల్'లో ఫిర్యాదు చేయవచ్చు. టోల్ ఫ్రీ నంబరు 1950లోనూ ఫిర్యాదు చేయవచ్చు.

ఓటర్లకు సక్షం ఆసరా

పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వారికి 'సక్షం' మొబైల్ యాప్ ఉపయుక్తంగా మారింది. వృద్ధులు, దివ్యాంగులు తమ వివరాలను ఈ యాప్‌లో నమోదు చేస్తే ఎన్నికల అధికారులు పరిశీలించి వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తారు. అవసరమైన వారికి మూడు చక్రాల కుర్చీలతో పాటు పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లేందుకు సహాయకుడిని అందుబాటులో ఉంచుతారు. ఇప్పటికే చాలా మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

అభ్యర్థి గురించి తెలుసుకోండి

తమ నియోజకవర్గం నుంచి ఏయే పార్టీల నుంచి ఎవరెవరు పోటీ చేస్తున్నారు? మొత్తం ఎంత మంది పోటీ చేస్తున్నారు? వంటి వివరాలు తెలుసుకొనేందుకు 'నో యువర్ క్యాండిడేట్(కేవైసీ) యాప్ ఉపయోగపడుతుంది. అభ్యర్థులు, వారి విద్యార్హతలు, నేర చరిత్ర, ఆస్తిపాస్తుల వివరాలు ఇందులో ఉంటాయి. నామినేషన్లు దాఖలు చేయగానే ఈ వివరాలు యాప్‌లో అందుబాటులోకి వస్తాయి. అభ్యర్థి 'అఫిడవిట్'ను డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం కూడా ఉంది.


ఎంత మంది ఓటేశారంటే..!

పోలింగ్ ప్రక్రియ ముగియగానే నియోజకవర్గాల వారీగా ఎంత పోలింగ్ శాతం నమోదైందనే వివరాలు 'టర్నౌట్' యాప్‌లో అందుబాటులో ఉంటాయి. ఎన్నికలు, నియోజకవర్గం తదితర వివరాలను అప్‌లోడ్ చేస్తే వివరాలు కనిపిస్తాయి. జిల్లా, నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం తెలుసుకోవచ్చు.

క్లిక్ దూరంలో సమాచారం

ఓటరు నమోదు, గుర్తింపు కార్డు డౌన్‌లోడ్, ఫిర్యాదులు, ఎన్నికల ఫలితాలు, అభ్యర్థుల వివరాలు 'ఓటరు హెల్ప్‌లైన్' యాప్‌లో అందుబాటులో ఉంటాయి. ఎన్నికల సంఘం జారీ చేసే ఉత్తర్వులు, ప్రకటనలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతాయి. ఎన్నికల షెడ్యూలు, పోలింగ్ తేదీలు తెలుసుకోవచ్చు. గుర్తింపు పొందిన, రిజిస్టర్డు పార్టీలుగా నమోదుకు అర్హతలు, వాటికి గుర్తుల కేటాయింపు తీరు తదితర సమగ్ర సమాచారం ఈ యాప్‌లో ఉంటుంది. ఎన్నికల సంఘం రూపొందించిన వివిధ యాప్‌ల ద్వారా లభించే అత్యధిక సమాచారాన్ని ఈ ఒక్క యాప్‌తో తెలుసుకోవచ్చు.

# కాలువ జాగా.. కనిపిస్తే కబ్జా



సుల్తానాబాద్: :కాట్నపల్లి కొమురయ్యకుంట నుంచి వచ్చే వరద మత్తడి ద్వారా స్థానిక పెద్దచెరువులో చేరుతుంది. కాగా స్థిరాస్తి వ్యాపారులు వరద ప్రవాహానికి అడ్డుగా రాజీవ్ రహదారికి ఆనుకొని మట్టిని పోసి చదును చేస్తున్నారు. దీంతో వానాకాలంలో వరదతో పక్కనున్న పంట పొలాలు నీట మునిగే పరిస్థితి నెలకొంది. జిల్లాకేంద్రానికి సమీపంలో ఉండటం, రాజీవ్ రహదారిని ఆనుకొనే ఉండటంతో సుల్తానాబాద్ మండలంలోని పలు చెరువులు, కుంటలు, వాగులు, వంకలపై స్థిరాస్తి వ్యాపారుల కన్ను పడింది. 'ఆక్రమణలకు కాదేదీ అనర్హం' అన్న చందాన ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. చెరువులు, కుంటలు, పొలాల నుంచి వరద ప్రవహించే కాలువ మార్గాలకు అడ్డుగా మట్టి పోసి విక్రయిస్తున్నారు. దీంతో ఏటా వానాకాలంలో పంట పొలాలను వరద ముంచెత్తి రైతులు నష్టపోతున్నారు.

కాలువల కబ్జా

మండలంలో మానేరు, హుస్సేన్‌మియా వాగులతో పాటు చెరువులు, వాగుల నుంచి వాగులు, కాలువలు పారుతున్నాయి.

దుబ్బపల్లి వద్ద ఎగువ పొలాల నుంచి వచ్చే వరద చిన్నవాగు ద్వారా గర్రెపల్లి చెరువులో చేరుతోంది. కాగా ఈ వాగు స్థిరాస్తి వ్యాపారుల చేతిలో ఆక్రమణకు గురైంది.

భూపతిపూర్ చెరువు, కుంటల నుంచి వరద కాలువ ద్వారా గర్రెపల్లి చెరువులో చెరుతోంది. ఈ కాలువను పలు చోట్ల ఆక్రమించారు.

సుల్తానాబాద్ గ్రామ చెరువు నుంచి వరద పొలాల్లో కాలువ ద్వారా కిందకు పారుతుంది. ఈ కాలువను కబ్జా చేశారు.

చిన్నకల్వల వద్ద హుస్సేన్‌మియా వాగు స్థలాన్ని ఆక్రమించి స్థిరాస్తి వెంచర్‌ను కూడా ఏర్పాటు చేశారు.

సుల్తానాబాద్ పెద్ద చెరువు నిండి మత్తడి పారినపుడు వరద హుస్సేన్‌మియా వాగులో కలుస్తోంది. అయితే సుగ్లాంపల్లి వద్ద వాగులో స్థిరాస్తి వ్యాపారులు మట్టి పోసి చదును చేస్తూ అమ్ముకొంటున్నారు. దీంతో వర్షాకాలంలో వరద ఎక్కువైనప్పుడు వాగు పక్కన పొలాల్లోకి చేరి నష్టం వాటిల్లుతోంది.

ఏటా వానాకాలంలో సుల్తానాబాద్ పెద్దచెరువు నుంచి వరద పొలాల మీదుగా దిగువకు వెళ్తుంది. ఈ కాలువకు అడ్డుగా రాజీవ్ రహదారిని ఆనుకొని మట్టిని పోసి, పైపులు వేసి కాలువ విస్తీర్ణాన్ని తగ్గిస్తూ ఆక్రమించుకుంటున్నారు. దీంతో వానాకాలం వరదకు పొలాలు నీట మునిగే పరిస్థితి నెలకొంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఈ విషయమై ఎస్సారెస్పీ డీఈ మధుమతిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆక్రమణకు గురైన కాలువ ప్రాంతాలను పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# నాసిరకం మాంసం విక్రయాలు!



కామారెడ్డి : బాన్సువాడ పట్టణంలోని మటన్ మార్కెట్‌కు ఓ వ్యక్తి గాయపడ్డ మేకను తీసుకొచ్చారు. దానిని విక్రయించేందుకు ఓ వ్యాపారి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. మేక మెడకు గాయాలు ఉండటంతో గమనించిన పలువురు బల్దియాకు సమాచారం అందించారు. దీంతో కమిషనర్ తనిఖీలు చేపట్టారు. విక్రయిస్తున్న మాంసం నాసిరకంగా ఉందని, దానిని వ్యాపారి నుంచి స్వాధీనం చేసుకొన్నారు.

పర్యవేక్షణ లోపం..

ప్రతి రోజూ మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టాలి. వారు ధ్రువీకరిస్తేనే మేకను కోయాల్సి ఉంటుంది. ఇలా నిబంధనలు ఉన్నా ఇక్కడ అటువంటివి జరగకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యత లేని, రోగాల బారినపడిన వాటిని విక్రయిస్తున్నారు. పశువైద్యశాల అధికారులు సైతం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే విషయమై వారిని సంప్రదిస్తే పుర అధికారులే చూస్తున్నారని చెప్పారు.

'నాసిరకం మాంసం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు. ప్రత్యేక తనిఖీలు చేపడుతాం. మాంసాన్ని స్వాధీనం చేసుకున్నాం. ఫుడ్ సేఫ్టీ అధికారులకు నాణ్యత ధ్రువీకరణ కోసం పంపనున్నాం. మేకను ఖననం చేశాం. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై పోలీసులను సంప్రదించి కేసులు నమోదు చేస్తాం. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం విక్రయాలు జరపాలి' అని బాన్సువాడ బల్దియా కమిషనర్ అలీం తెలిపారు. గడువు ఐదు రోజులే : జిల్లాకేంద్రంలో 5 శాతం రాయితీపై ఆస్తి పన్ను చెల్లించేందుకు గడువు ఐదు రోజులే మిగిలి ఉంది. ఇప్పటివరకు రూ. 20 లక్షల మేర పన్ను సమకూరింది. గతేడాది ఈపాటికి రెట్టింపు మేర పన్ను సమకూరింది. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి బల్దియాకు ఆదాయం సమకూర్చేందుకు తోడ్పాటును అందించాలని కమిషనర్ సుజాత కోరారు.

# ఓటు పోటెత్తేలా!

కామారెడ్డి : ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది. వజ్రాయుధాన్ని సమర్థంగా వినియోగిస్తేనే మంచి భవిష్యత్తు కోసం పనిచేసే నాయకులు ఎన్నికవుతారు. ఏమాత్రం అలసత్వం వహించినా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.గత ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పరిశీలించిన అధికారులు ఈసారి మరింత పెంచేందుకు దృష్టి సారించారు. స్వీప్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నారు. మే 13న జరిగే పోలింగ్ రోజున అందరూ బాధ్యతగా ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు నడవాలి.

లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి పోలింగ్ శాతం మెరుగ్గా ఉండేందుకు ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రత్యేక కార్యక్రమాలతో ఓటర్లలో చైతన్యం చేస్తోంది. నిజామాబాద్ పార్లమెంటు స్థానంలో ఇటీవల కాలంలో కనీసం 70 శాతం పోలింగ్ చూసిన దాఖలాలు లేవు. దీంతో యంత్రాంగం తక్కువ పోలింగ్ అయ్యే స్థానాలపై దృష్టి పెట్టి దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక పరిశీలకులను రంగంలోకి దించింది.

స్వీప్ ద్వారా చైతన్యం

సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ (ఎస్‌వీఈఈపీ)తో ఎన్నికల యంత్రాంగం క్షేత్రస్థాయిలో వెళ్తోంది. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు, మహిళ సంఘాలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. బస్టాండు, రైల్వేస్టేషన్, ప్రార్థన మందిరాలు, కళాశాలలు, పరిశ్రమల వద్ద ఓటరు చైతన్య ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు. గత ఎన్నికల్లో 40 శాతం కంటే తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కామారెడ్డి జిల్లాలో సంకల్పపత్రాలను విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు అందించి వాటిపై సంతకాలు చేయించారు. ఇటీవల 5కే పరుగు ద్వారా పోలింగ్‌పై అవగాహన పెంచారు.



అందుబాటులో సౌకర్యాలు

పోలింగ్ రోజు ఓటర్లకు ఇబ్బంది కలగవద్దని ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమలకు సెలవు విధానం కొనసాగుతోంది. ఎన్నికల విధుల్లో ఉంటే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. కొత్తగా గత ఎన్నికల నుంచి 85 ఏళ్ల పైబడిన వారు, శారీరక వైకల్యం ఉన్న వారికి ప్రత్యేకంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీడ, మంచి నీటి వసతి, నడకకు వీలుగా ర్యాంపులు అన్నీ సరిచూసుకుంటున్నారు.

సెల్ఫీ పాయింట్

ఈవీఎం మోడల్స్, సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఓటు విలువ తెలిసేలా మహిళా సంఘాలకు రంగోళి, మెహందీ పోటీలతో ఉత్సాహపరుస్తున్నారు. ప్రత్యేక కూడళ్ల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రజాస్వామ్య హక్కుగా ఓటును వినియోగించుకోవాలని వివరిస్తున్నారు.

# ఫలితం లేదు..

మెదక్ : జిల్లాలో ఇంటర్మీడియట్ ఫలితాలు కొంతమేర ఊరటనిచ్చిన ప్పటికీ ఆశించిన స్థాయిలో రాలేదు. గత నాలుగేళ్ల నుంచి ఫలితాల్లో జిల్లా చివరి స్థానంలో నిలుస్తుండగా.. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 28, ద్వితీయ సంవత్సరంలో 31వ స్థానంలో నిలిచింది. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం నూతన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. ఆశించి స్థాయిలో ఫలితాలు రావడంలేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో ప్రతి దానిలో ఏదో ఒక సమస్య వేధిస్తుండటం ప్రధాన కారణం.

5 కళాశాలల్లో దారుణం

జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 ప్రభుత్వ కళాశాలలు ఉండగా అందులో చివరి నుంచి తూప్రాన్-15.29 శాతం, చేగుంట-23.44శాతం, శివ్వంపేట-27.27శాతం, వెల్దుర్తి-30.1శాతం, రామాయంపేట-30.77 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించాయి. తూప్రాన్‌లోని కళాశాల గతం ఏడాది సైతం చివరి నుంచి 2వ స్థానంలో 22.08 శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రస్తుతం ఇంకా దిగజారి 15.29శాతానికి పడిపోయి జిల్లాలో చిట్టచివరి స్థానంలో నిలిచింది.

13 మందే పాస్: జిల్లాలోని పెద్ద పట్టణాల్లో ఒకటైన తూప్రాన్ రెండేళ్ల నుంచి అట్టడుగు స్థానంలో ఉంటోంది. ఈ ఏడాది 85 మంది విద్యార్థులు పరీక్ష రాయగా కేవలం 13 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఇక్కడ సొంత భవనంతో పాటు అదనపు గదులు, అన్ని రకాల సదుపాయాలు, సరిపడా సిబ్బంది ఉన్నప్పటికీ 15.29 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది. విద్యార్థుల హాజరు శాతం, అధ్యాపకుల బోధన, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర వాటిల్లో పూర్తిగా అలసత్వం వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

చేగుంటలో 23.44శాతం: చేగుంటలో రెండు అంతస్తుల్లో అందమైన భవనం ఉంది. దీంతో పాటు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులు, సదుపాయాలు ఉన్నా.. ఫలితాల్లో మాత్రం వెనకబడింది. విద్యార్థులు తరగతులకు సరిగా హాజరుకాకపోవడంతో పాటు బోధన సరిగా సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే నార్సింగి మండలంలోని కళాశాలకు సొంత భవనం లేకున్నా.. 92శాతంతో జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. చెట్ల కింద పాఠాలు: శివ్వంపేట కళాశాలలో ద్వితీయలో 33మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 9మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. సొంత భవనం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 2008లో కళాశాలను ప్రారంభించగా ఇంతవరకు పక్కా భవనం లేదు. ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3 గదులను కేటాయించారు. అందులోనే కార్యాలయం, ల్యాబ్, బోధన జరుగుతోంది. కొన్నిసార్లు చెట్ల కింద పాఠాలు చెప్పాల్సి వస్తోంది. ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో కలిపి మొత్తం 59 మంది ప్రవేశం పొందగా సరైన సౌకర్యాలు లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు మాత్రమే తరగతులకు హాజరవుతున్నారు. 9 ఏళ్ల క్రితం పక్కా భవనానికి రూ. 10 కోట్లు మంజూరవగా.. ఇంతవరకు స్థల పరిశీలన సైతం పూర్తి కాలేదు.ప్రత్యేక తరగతులు నిర్వహించినా: ఉత్తీర్ణతలో జిల్లాలో చివరి నుంచి వరుసగా వెల్దుర్తి 4, రామాయంపేట 5వ స్థానాల్లో ఉన్నాయి. ఈ కళాశాలల్లో అన్ని సదుపాయాలు, అధ్యాపకులు, మౌలిక వసతులు ఉన్నప్పటికీ ఫలితాలు మాత్రం ఆశాజనకంగా లేవు.

# స్మార్ట్‌గా ఓటర్లకు చేరువ

హైదరాబాద్: ఎన్నికలంటే పార్టీలు, అభ్యర్థుల పాటలతో బస్తీలు మార్మోగేవి. కార్యకర్తలు, అభిమానులు పార్టీ జెండాలు, కండువాలతో పెద్దఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించేవారు. అభ్యర్థి వెంట భారీ సంఖ్యలో కార్యకర్తలు వెళ్లేవారు. ప్రస్తుత ధోరణి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రచారంలో సోషల్ మీడియా కీలకంగా మారింది. నామినేషన్లు వేసేటప్పుడు, బహిరంగ సభలకు మాత్రమే జన సమీకరణ చేస్తున్నారు. ఎక్కువగా సామాజిక మాధ్యమాలు, ఫోన్ కాల్స్ ద్వారా ఓటర్లకు చేరువ అవుతున్నారు. ఓ వైపు ఎండ తాకిడి, మరోవైపు ఖర్చుల దృష్ట్యా ఇంటింటి ప్రచారానికి ఎక్కువగా ఆసక్తి చూపించడం లేదు.

సోషల్ మీడియా విభాగాల ఏర్పాటు..: స్మార్ట్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగింది. డేటా సైతం తక్కువ ధరకే లభిస్తోంది. యువత ఉదయం లేచింది మొదలు ఏదో ఒక సోషల్ మీడియాలో కంటెంట్ చూస్తున్నారు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు స్మార్ట్ ప్రచారానికి మొగ్గు చూపుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సోషల్ మీడియా విభాగాలు ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం అభ్యర్థుల వెంట వ్యక్తిగత వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు ఉంటున్నారు. సమావేశాలు, ఇంటింటి ప్రచారాల్లో చిత్రీకరించిన వీడియోలు, చిత్రాలను సోషల్ మీడియా విభాగం ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్‌ల్లో అప్‌లోడ్



చేయడంతోపాటు మీడియా, కమ్యూనిటీ, పార్టీ వాట్సప్ గ్రూప్‌ల్లో షేర్ చేస్తున్నారు. మరికొందరు సంక్షిప్త సందేశాలు, వాయిస్ కాల్స్ విధానాన్ని ఎంచుకుంటున్నారు. అభ్యర్థులు ఉదయం వాకర్స్‌తో ముచ్చటిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, సామాజిక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఆచితూచి అడుగులు..

ఇందుకోసం డబ్బులతో పాటు భోజనం, మద్యం వంటివి పంపిణీ చేసి జన సమీకరణ చేసేవారు. ఫలితంగా అభ్యర్థుల ఖర్చు తడిసి మోపెడయ్యేది. ఎండలు మండిపోతుండటంతో ఇంటింటి ప్రచారానికి వచ్చేందుకు రోజు కూలీలు ఆసక్తి చూపకపోవడంతో నేతలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎక్కువ డబ్బులిస్తామని ఆశ చూపుతున్నారు.


# దోమా దోమ.. ఇం'ధనం ఏదమ్మా'?

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం దోపిడీకి చిరునామాగా మారింది. ఫాగింగ్ పేరుతో కొందరు జోనల్ స్థాయి అధికారులు డీజిల్‌ను అమ్మేసుకుంటున్నారు. సహాయ ఎంటమాలజిస్టులు, సీనియర్ ఎంటమాలజిస్టుల వరకు చాలామంది అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా.. చార్మినార్ జోన్‌లోని ఓ అధికారి డీజిల్, పెట్రోలు విషయంలో తన వాటా విషయమై సిబ్బందిని వేధించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

రోజుకు 600–700లీటర్లు పక్కదారి...

ఫాగింగ్ కోసం జీహెచ్ఎంసీ ఇందుకోసం ఏడాదికి సుమారు రూ.7కోట్లు వెచ్చిస్తుందని అంచనా. అందులో దాదాపు 70శాతం నిధులు దారి మళ్లుతున్నాయని తెలుస్తోంది.

నగరంలో 63 పెద్ద, 302 చిన్న ఫాగింగ్ యంత్రాలు పనిచేస్తున్నాయి. పెద్ద యంత్రాలకు రోజూ 45లీటర్ల డీజిల్, 9లీటర్ల పెట్రోలు, రెండు లీటర్ల మలాథిన్ మందు కేటాయిస్తారు. చిన్న వాటికి రోజూ 9 లీటర్ల డీజిల్, 1.5లీటర్ల పెట్రోలు, కొద్దిపాటి మలాథిన్‌ను ఇస్తారు. కానీ.. కేటాయింపులన్నీ కాగితాలపైనే కనిపిస్తున్న పరిస్థితి. 80శాతం డీజిల్‌ను పెట్రోలు బంకులోనే విక్రయిస్తామని, పెట్రోలు కూపన్లను అధికారులు, సిబ్బంది వాహనాల కోసం ఉపయోగించుకుంటామని చార్మినార్ జోన్‌లోని ఫాగింగ్ సిబ్బందే వాపోతున్నారు. కొంతకాలంగా ఓ అధికారి పెట్రోలు మొత్తాన్ని తనకే ఇవ్వాలని వేధిస్తున్నట్లు తెలిపారు. తమ



జోన్ పరిధిలోని సర్కిళ్లు, డివిజన్లు, మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టేందుకు రోజుకు కేటాయించే 600లీటర్ల డీజిల్‌లో 20 శాతం మాత్రమే సద్వినియోగం అవుతుందని తెలుస్తోంది.

మలాథిన్ రసాయనాన్ని.. సరఫరా ఏజెన్సీలకే ఆ మందును తిరిగి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలొస్తున్నాయి.

మూడు నెలలుగా జీతాల్లేవు.. కొవిడ్ సమయంలో క్రిమి సంహారక మందులు జనావాసాల్లో పిచికారీ చేసేందుకు జీహెచ్ఎంసీ 210 మందిని తాత్కాలికంగా నియమించుకుంది. అనంతరమూ వారి సేవలను ఉపయోగించుకుంటోంది. ఫాగింగ్, ఇంటింటి దోమల నివారణ చర్యలు, గుర్రపుడెక్క తొలగింపు, ఇతరత్రా పనుల్లో వారు పని చేస్తున్నారు. వారికి మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. ఇళ్ల కిరాయిలు కట్టలేక, ఇంటిని నడిపించలేక నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

# నేతలు రోడ్డెక్కె.. ప్రచారం వేడెక్కె



హైదరాబాద్: రాజధానిలో లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం వేడెక్కింది. మొన్నటివరకు అభ్యర్థులు ఖరారు కాకపోవడం.. ఎండలు మండిపోతుండటంతో జనంలోకి వెళ్లడానికి నేతలు వెనకాముందాడారు. ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో పార్టీల్లో కదలిక వచ్చింది. నాయకులంతా జనంలోకి వెళ్లడానికి రోడ్డెక్కుతున్నారు. దీంతో ఒకవైపు కాంగ్రెస్ మరోవైపు భారాస, భాజపా పోటాపోటీగా ప్రచార పర్వంలో దూసుకుపోతున్నాయి. రాజధాని పరిధిలో సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, హైదరాబాద్ లోక్‌సభ స్థానాలున్నాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. మొన్నటివరకు ఎక్కడా ఎన్నికల హంగామా కనిపించలేదు. కిందిస్థాయి నాయకుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఎవరూ ప్రచారంలో పాల్గొనలేదు. గురువారంతో నామినేషన్ల ఘట్టం పూర్తికావడం.. ప్రచారానికి 16 రోజులే ఉండటంతో అన్ని పార్టీలు ఒక్కసారిగా రంగంలోకి దూకాయి. ఒకవైపు అగ్రనేతలతో ప్రచారం చేయడంతో పాటు మరోవైపు స్థానిక నేతలతో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలవడానికి సిద్ధమవుతున్నారు.

కాంగ్రెస్ దూకుడు

మిగిలిన పార్టీలతో పోల్చుకుంటే రాజధాని పరిధిలో కాంగ్రెస్ ప్రచారంలో దూకుడుగా ముందుకెళ్తోంది. ఈ నెల 6న తుక్కుగూడలో బహిరంగ సభ ఏర్పాటు చేసి మ్యానిఫెస్టో తెలుగు ప్రతిని విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సభలతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే మల్కాజిగిరి స్థానానికి సంబంధించి శామీర్‌పేటలో భారీ సభ నిర్వహించారు. సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. గురువారం చేవెళ్లకు సంబంధించి అత్తాపూర్‌లోనూ, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి అన్నానగర్ చౌరాస్తా వద్ద జరిగిన సభల్లో సీఎం భాజపా, భారాసలపై విరుచుకుపడ్డారు. హైదరాబాద్ పరిధిలో భారీ సభను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 10లోగా మరో ఆరేడు సభలు నిర్వహించాలని నిర్ణయించారు. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు పాల్గొనబోతున్నారు.

ఎమ్మెల్యేలే కీలకంగా..

ఇప్పటికే చేవెళ్లలో భారాస కొద్దిరోజుల కిందట భారీ బహిరంగ సభను నిర్వహించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో కీలక ప్రసంగం చేశారు. ఇప్పుడు ఆయన వచ్చే నెల పదో తేదీ వరకు జిల్లాల్లో జరుగుతున్న బస్సు యాత్రలో పాల్గొంటున్నారు. 11వ తేదీ తరువాత ఇక్కడ మరో భారీ సభను నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్ అన్ని లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలు పూర్తి చేశారు. రాజధానిలో నాలుగు స్థానాల ప్రచార బాధ్యతను ఆయన తలకెత్తుకున్నారు. నియోజకవర్గాల వారీగా కార్నర్ మీటింట్‌లు నిర్వహించడానికి కేటీఆర్ సిద్ధమవుతున్నారు. ఈలోపులో పార్టీపరంగా ప్రచార బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించారు. వారం రోజుల కిందటి వరకు ఎమ్మెల్యేల్లో కదలిక కనిపించలేదు. పార్టీ ఆదేశాలతో రంగంలోకి కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యేలందరితో కేటీఆర్ రోజువారీగా మాట్లాడుతున్నారు.

ఇంటింటి ప్రచారంపై దృష్టి

అన్ని పార్టీలకంటే ముందే భాజపా అభ్యర్థులను ప్రకటించింది. అభ్యర్థులు ఇప్పటికే మొదటి విడత ప్రచారాన్ని పూర్తి చేశారు. ఇంటింటి ప్రచారంపైనే ప్రధానంగా దృష్టిసారించారు. వివిధ సంఘాలతో సమావేశమై మరోసారి మోదీ ప్రధాని కావాల్సిన అవసరాన్ని వివరిస్తున్నారు. గత నెలలో మల్కాజిగిరిలో మోదీ రోడ్డుషో నిర్వహించారు. ప్రచారం ముగిసేలోగా ఆయన రాజధాని పరిధిలో రెండు బహిరంగ సభల్లో పాల్గొనబోతున్నారు. ఈ నెల 30న మోదీ హైదరాబాద్‌కు చేరుకుని శేరిలింగంపల్లిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో సమావేశం కానున్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సైతం ప్రచారంలో పాల్గొంటారని భాజపా నేతలు చెబుతున్నారు. మరోవైపు ఎంఐఎం హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి అసదుద్దీన్ ఇప్పటికే తన పరిధిలోని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నారు.

# మంగళ్ 'హాట్ ఠాణా'




ధూల్‌పేట : "మంగళ్‌హాట్ ఠాణా డీఐ (డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్) మహేందర్‌రెడ్డి తన పుట్టిన రోజు వేడుకల్ని జూదరులతో కలిసి జూద గృహంలోనే జరుపుకొన్నారనే అభియోగంపై సీపీ సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది."

"రెండేళ్ల క్రితం గంజాయి వ్యాపారులతో మిలాఖత్ అయిన అప్పటి సీఐ రణవీర్‌రెడ్డి సస్పెండ్ కావడం, అంతకు కొన్ని రోజుల ముందే ఓ జూద గృహంపై దాడి (పరిధి తమది కాకున్నా) చేసి రూ.14 లక్షలు వసూలు చేసి లెక్కల్లో మాత్రం కేవలం రూ.2 లక్షలు చూపిన ఉదంతం బయటకు పొక్కింది. అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు కానిస్టేబుళ్లు మొత్తం అయిదుగురు సస్పెన్షన్‌కు గురయ్యారు."

శాంతిభద్రతలపరంగా మంగళ్‌హాట్ ఠాణా అతి సున్నితమైంది. పోలీస్ స్టేషన్‌లో కొందరు అధికారులు, సిబ్బంది అవినీతి, అక్రమాలతో అప్రతిష్ఠ మూటగట్టుకుంటోంది. ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తున్నా.. పదేపదే హెచ్చరిస్తున్నా.. ఠాణాలో కొందరు సిబ్బంది తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు. పోలీస్‌స్టేషన్ పరిధిలో విచ్చలవిడిగా గంజాయి స్మగ్లింగ్, జూదం నిర్వహణ, క్రికెట్ బెట్టింగ్, బెల్టు దుకాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

అనవసర జోక్యం.. ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టిన ఓ అధికారి స్థానికంగా అన్నీ తానై వ్యవహరించి అక్రమ వ్యాపారులకు అండగా నిలిచారనే ఆరోపణలు ఉన్నాయి. జూద గృహాల నిర్వహణకు అక్రమంగా అనుమతులిచ్చి ఒక్కో టేబుల్‌కి రూ.5 వేలు చొప్పున రోజుకు 10 నుంచి 12 టేబుళ్లు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించేలా జూద బృందాలను కొందరు అధికారులు, సిబ్బంది ప్రోత్సహిస్తున్నట్లు తెలిసింది. ఆ అధికారి గతంలో ఎస్సైగా పనిచేసిన సమయంలో శివారులోని ఓ ఠాణాలో సస్పెండ్ అయినట్లు తెలిసింది. కానిస్టేబుళ్లలో కొందరు గతంలో ఇతర ఠాణాల్లో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడి సస్పెండ్‌కు గురై తిరిగి విధుల్లో చేరినట్లు సమాచారం.

అందినకాడికి దండుకొని.. ఠాణాలో కొందరు అధికారులు, సిబ్బంది చేతి వాటం ఎక్కువైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి విక్రేతలకు కొమ్ముకాస్తూ.. అందినకాడికి దండు కోవడమే పనిగా పెట్టుకున్నారని కొందరు సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు. రాత్రి 11 గంటల తర్వాత ప్రారంభమయ్యే జూద గృహాలు తెల్లవారు అయిదు గంటల వరకు కొనసాగుతున్నాయని, అక్కడే మద్యం, గంజాయి అందజేస్తున్నట్లు సమాచారం. వీటన్నింటిని కొందరు సెక్టార్ కానిస్టేబుళ్లు సమన్వయం చేస్తూ.. క్రైమ్ పార్టీకి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు కీలక భూమిక వహించినట్లు తెలిసింది. వీరికి తోడుగా పోలీసు ఇన్ఫార్మర్ల పేరుతో ఠాణాలో కలియదిరిగే కొందరు వ్యక్తులు అక్రమార్కులు, పోలీసులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ ఆర్థిక లావాదేవీలు చక్కబెడుతుండడం గమనార్హం.

అక్రమార్కులను వేధిస్తూ ..

అక్రమ వ్యాపారం మానేసిన వారిని సైతం తిరిగి అదే వృత్తి కొనసాగించాలని కొందరు సిబ్బంది ప్రోత్సహిస్తుండటం, అందుకు వారు నిరాకరిస్తే వేధింపులకు దిగడడంపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవలే ఈ రకమైన వేధింపులకు పాల్పడుతున్న ఓ కానిస్టేబుల్‌పై రెండు చోట్ల భౌతిక దాడులు కూడా జరిగినా.. అది బయటకు పొక్కకుండా జాగ్రత్త వహించడం విశేషం. ఓ ఎస్సై అప్పర్ ధూల్‌పేటలో మహిళల పట్ల దౌర్జన్యాలకు పాల్పడుతుండడంతో స్థానికులు స్టేషన్ ఎదుట ఆందోళనకు సిద్ధమయ్యారు. మధ్యవర్తులు జోక్యం చేసుకొని పరిస్థితి చక్కదిద్దినట్లు తెలిసింది. బ్లూ కోల్ట్స్ పోలీసుల్లో కొందరి ఆగడాలు సైతం మితిమీరిపోయాయని.. వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# రారండోయ్.. ఓటేయడానికి ఆంధ్రాకు


హైదరాబాద్: ఎన్నికలంటే ఎప్పుడైనా సందడే.. ఓటర్లను కూడగట్టడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న పని. ప్రస్తుత ఎన్నికలు ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ప్రతిష్ఠాత్మకమని భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ ఓటు ఉండి.. నగరంలో నివాసముంటున్న వారికి ఆంధ్రా నేతల నుంచి ఎన్నికల పిలుపువచ్చింది. ఎంతమంది ఓటర్లున్నారో తెలుసుకుని వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. చిరు ఉద్యోగులపైనే దృష్టి : ఉపాధిని వెతుక్కుంటూ నగరానికి వచ్చి స్థిరపడినవారు లక్షల్లో ఉన్నారు. అక్కడ ప్రభుత్వాల నుంచి లబ్ధి పొందేందుకు వీరిలో చాలామందికి అక్కడి చిరునామాతోనే ఆధార్ కార్డులున్నాయి. ఓట్లు కూడా చాలా మందికి నగరంలోనూ, ఏపీలోనూ ఉన్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఇలాంటి పరిస్థితుల్లో నగరంలో ఇళ్లలో పని చేస్తున్నవారు, వాచ్‌మ్యాన్‌లుగా ఉన్నవారితో పాటు వివిధ సంస్థల్లో చిరు ఉద్యోగాలు చేస్తున్న వారిపై అక్కడి నేతలు ప్రధానంగా దృష్టి సారించారు. వారు వచ్చేందుకు ప్రయాణ వసరు కల్పిస్తున్నారు. కొంతమంది సొంతంగా వస్తామంటే.. ప్రయాణ ఖర్చులిస్తున్నారు ఇళ్లల్లో పని చేస్తున్నవారు, అపార్టుమెంట్లలో వాచ్‌మెన్లు చాలావరకు ఏపీ వాళ్లున్నారు. రెండ్రోజుల ముందే వెళ్తామని యజమానులను అనుమతులు కోరుతున్నారు.



# టీఎస్‌బీపాస్‌తోనే అనుమతులు..

## డీపీఎంఎస్ విధానం పూర్తిగా నిలుపుదల

హైదరాబాద్ : భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులను హెచ్ఎండీఏ పరిధిలో ఇక నుంచి ఏకగవాక్ష పద్ధతిలో జారీ చేయనున్నారు. గతంలో అందుబాటులోకి తెచ్చిన తెలంగాణ స్టేట్ లేఅవుట్ అండ్ బిల్డింగ్ పర్మిషన్ ఆమోదం, స్వీయ ధ్రువీకరణ వ్యవస్థ(టీఎస్‌బీపాస్) ద్వారానే అనుమతులు మంజూరు చేస్తారు. హెచ్ఎండీఏ ఏడు జిల్లాల పరిధిలోని 70 మండలాలు, 1032 గ్రామాలు, ఏడు కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీల్లో విస్తరించి ఉంది. ఇప్పటివరకు ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలు, లేఅవుట్ అనుమతుల కోసం టీఎస్‌బీపాస్‌తోపాటు 2016లో ప్రవేశపెట్టిన డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(డీపీఎంఎస్) విధానాన్ని వాడుతున్నారు. ఇది పాత విధానం కావడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రక్రియలో జాప్యం తోపాటు జవాబుదారీతనం లోపిస్తోంది. ఈ నేపథ్యంలో డీపీఎంఎస్‌ను పూర్తిగా నిలుపుదల చేయాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. హెచ్ఎండీఏ పరిధిలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతోపాటు గ్రామ పంచాయతీల్లో అనుమతులు కోసం



టీఎస్‌బీపాస్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఇవీ ప్రయోజనాలు...

టీఎస్‌బీపాస్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి నేరుగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేసి నిర్ణీత ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఏకగవాక్ష విధానంలో అన్ని విభాగాల నుంచి ఎన్‌వోసీలను పొందే వీలుంది.

డీపీఎంఎస్‌తో పోల్చితే డేటా, దరఖాస్తుదారుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రత ఉంటుంది.. దరఖాస్తు చేసుకున్న నిర్ణీత వ్యవధిలో అనుమతులు మంజూరు చేయాలి. ఉద్దేశ పూర్వకంగా జాప్యం చేస్తే...సదరు అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే వీలు ఇందులో ఉంది. నిర్ణీత కారణం లేకుండా అర్జీలను తిరస్కరించే అధికారం సిబ్బందికి లేదు.

టీఎస్‌బీపాస్ విధానంలో 75 చదరపు గజాల విస్తీర్ణం జీప్లస్ వన్ ఫ్లోర్ బిల్డింగ్ కోసం అనుమతి లేదా ఆక్యుపెన్సీ ధ్రువపత్రం పొందాల్సిన అవసరం లేదు. ఇలాంటి సందర్భంలో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. అనుమతుల అవసరం లేకుండా ఇల్లు కట్టుకోవచ్చు. అంతకుమించిన భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ ధ్రువీకరణ కోసం ఇందులో దరఖాస్తు చేసుకోవచ్చు.

కొత్త లేఅవుట్లకు సైతం టీఎస్‌బీపాస్ ద్వారా అనుమతులు పొందవచ్చు. భూ వినియోగం, భూ వినియోగ మార్పిడి ధ్రువపత్రాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి ఎన్‌వోసీలకూ ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చు.

# రూ.వంద కోట్లు దాటినా.. ఇచ్చింది సున్నా

హైదరాబాద్: శివార్లలో మురుగు నిర్వహణకు సంబంధించి నిధుల విడుదలలో బల్దియా జాప్యంతో జలమండలి మల్లగుల్లాలు పడుతోంది. 13 నెలలుగా ఒక్క పైసా కూడా బల్దియా నుంచి జలమండలి ఖాతాకు జమ కావడంలేదని అధికారులు వాపోతున్నారు. నెలకు రూ.8.33 కోట్ల వంతున రూ.108 కోట్ల వరకు పేరుకుపోయాయి. ఈ బకాయిలు చెల్లించకపోగా.. తిరిగి జలమండలే ఆస్తి పన్ను కింద రూ.65కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. రావాల్సిన రూ.108 కోట్లలో రూ.65 కోట్లు పోను మిగతావి అందించాలని పదేపదే కోరుతున్నా జీహెచ్ఎంసీ నుంచి స్పందన ఉండటంలేదని అధికారులు పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ జాప్యం ప్రభావం శివార్లలోని మురుగు నిర్వహణపై పడుతోంది. గతంలో ప్రధాన నగరంలో మురుగు నిర్వహణ జలమండలి, శివారు 12 మున్సిపల్ సర్కిళ్లలో బల్దియా చూసేవి. 2008 తర్వాత గ్రేటర్ వ్యాప్తంగా మురుగు నిర్వహణ ఒకే గొడుగు కిందకు తెచ్చారు. తాగునీటి సరఫరాతోపాటు మురుగు నిర్వహణ జలమండలికే అప్పగించారు. సిబ్బంది జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులకోసం నెలకు రూ.8.33 కోట్లు బల్దియా నుంచి కేటాయించేలా ఒప్పందం జరిగింది. 13 నెలలుగా ఈ చెల్లింపు





లను బల్దియా నిలిపేయడంతో ఆ భారమూ జలమండలిపై పడుతోంది. ప్రస్తుతం గ్రేటర్ మురుగు నిర్వహణ పెద్ద సవాలుగా మారుతోంది. దాదాపు 250 ఎయిర్‌ట్రెక్ యంత్రాలు, 200వరకు సిల్టు తరలించే వాహనాలు, 3 వేల వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. శివార్లలోని పలు మున్సిపాలిటీల్లో ఇంకా మురుగు నీటి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి. ఈ నేపథ్యంలో నిధులు విడుదల కాక ఇబ్బందులు తప్పడంలేదు. రెండు వైపులా ఉన్నతాధికారులు చొరవతీసుకొని బల్దియానుంచి నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరుతున్నారు. లేదంటే శివార్లలో మురుగు నిర్వహణ మరింత భారంగా మారనుందని అంటున్నారు.



# కాంగ్రెస్‌లో చేరిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు

హైదరాబాద్: భారాసకు మరో షాక్ తగిలింది. తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో అమిత్‌రెడ్డి కలిశారు.




# రసవత్తరంగా ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల పోరు

ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికలు ప్రధాన పార్టీల నేతలకు సవాల్‌గా మారాయి. ఆ రెండుచోట్ల పాగా వేయడమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్న నేతలు.. ప్రత్యర్థి పార్టీలపై అస్త్రశస్త్రాలు సంధిస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల విజయంతో కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం నెలకొనగా.. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా గులాబీదళం ముందుకెళ్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా శ్రేణులను కమలదళం సైతం శ్రేణుల్ని కార్యోన్ముఖుల్ని చేస్తుండటంతో ఎన్నికల సమరం మరింత రసవత్తరంగా మారింది.

# నిన్నటి వరకు సీబీఐ, ఈడీ.. ఇప్పుడు ఢిల్లీ పోలీసులు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అమిత్‌షా వీడియో మార్ఫింగ్ వ్యవహారంలో తనతోపాటు పలువురికి ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇవ్వడంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. భాజపాపై పోరాడే వారికి అమిత్‌షా నోటీసులు పంపిస్తున్నారని విమర్శించారు. భాజపాను ప్రశ్నించినందుకే తమకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. మోదీ ఇప్పటి వరకు విపక్షాలపై సీబీఐ, ఈడీని ప్రయోగించారని, ఎన్నికల్లో గెలిచేందుకు ఇప్పుడు ఢిల్లీ పోలీసులనూ ప్రయోగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇక్కడ ఎవరూ భయపడేవాళ్లు లేరన్న సీఎం రేవంత్.. తెలంగాణ, కర్ణాటకల్లో భాజపాను ఓడించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

# హైదరాబాదీలూ హై అలర్ట్.. నగరంలోకి ప్రవేశించిన చిరుత



హైదరాబాద్: శంషాబాద్ ప్రాంతంలో ఓ చిరుత కదలికలు సీసీ కెమెరాలకు చిక్కడంతో ఆందోళన కలిగిస్తోంది. చిరుత రింగ్ రోడ్డులోపలికి ప్రవేశించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఏప్రిల్ 27న అర్ధరాత్రి చిరుతపులి కనిపించింది. విమానాశ్రయంలోని ఎయిర్‌క్రాఫ్ట్ రిపేర్ సెక్షన్‌లోని కంచెపై నుంచి దూకేందుకు చిరుత ప్రయత్నించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఎయిర్‌పోర్టు సిబ్బంది చిరుతను గుర్తించి భద్రతా సిబ్బందికి సమాచారం అందించగా సీసీ కెమెరాలను పరిశీలించారు. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు చిరుతపులిని బంధించేందుకు బోను ఏర్పాటు చేశారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరారు. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిరుత ఆనవాళ్లు కనిపిస్తే అధికారులకు సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు. వేసవి కాలంలో శంషాబాద్, యాచారం, మొయినాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో చిరుతపులులు సాధారణంగానే కనిపిస్తుంటాయి. చిరుతపులులు ఆహారం, నీటి కోసం మనుషుల నివాస ప్రాంతాలకు దగ్గరగా ఉంటాయి. ఇవి ఎక్కువగా వీధి కుక్కలను వెంటాడుతాయి. మనుషులపై దాడి చేసిన ఘటనలు కూడా ఉన్నాయి.

# కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ .. బీజేపీలోకి పెద్దపల్లి ఎంపీ



పెద్దపల్లి : పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత హస్తం పార్టీకి గుడ్ బై చెప్పి కాషాయతీర్థంపుచ్చుకోనున్నారు. ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకోనున్నారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను మర్యాదపూర్వకంగా కలవనున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీ వెంకటేష్ నేత కొద్ది రోజులకే పార్టీ వీడటం కాంగ్రెస్‌కు మైనస్ కానుంది.

# కేసీఆర్ నూరు అబద్ధాలు.. రేవంత్ వెయ్యి అబద్ధాలు



సిద్దిపేట, ఏప్రిల్ 29: గల్లీలో లేని ఢిల్లీలో లేని కారును గెలిపిస్తే మనకు మిగిలేది శూన్యమేనని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఎం. రఘునందనరావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నో రేవంత్ రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చారని.. అయితే కొలువు తీరిన కాంగ్రెస్ సర్కార్ ఐదు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మెదక్ పార్లమెంట్ కిసాన్ మోర్చా సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రఘునందనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రిగా కేసిఆర్ నూరు అబద్ధాలు ఆడితే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి అబద్ధాలు ఆడేందుకు సిద్దంగా ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఎరువుల కోసం చెప్పులు లైన్‌లో పెట్టిన విషయం మరవద్దంటూ ప్రజలకు రఘునందనరావు సూచించారు.

కేంద్రంలో నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడ ఎరువుల కొరత అనేదే లేకుండా చూశారని చెప్పారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను నరేంద్ర మోడీ నాయకత్వంలో పని చేసేందుకు పంపాలని ఈ సందర్భంగా ప్రజలకు రఘునందనరావు మనవి చేశారు. ఇక దుబ్బాక నియోజకవర్గం మీద బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి అవగాహన లేదన్నారు. ఆయనకు డబ్బులు పెట్టి ఓట్లు కొనడం మాత్రమే తెలుసునని చెప్పారు. ఓటర్లను బానిసలుగా చూసే సంస్కారం కొత్త ప్రభాకర్ రెడ్డిదని అభివర్ణించారు. ఎంపీ ఎన్నికలు పూర్తికాగానే కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరడం ఖాయమని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ పాలనలో జోకర్ గాళ్లు, బ్రోకర్ గాళ్లెక్కువ



సిద్దిపేట: పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా చేర్యాల పట్టణంలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి మద్దతుగా కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ మసమావేశంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో జోకర్ గాళ్ళు, బ్రోకర్ గాళ్ళు ఎక్కువని విమర్శించారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామలో దొంగ ఓట్లతో గెలించడని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌తో, గతంలో బీఆర్ఎస్ గెలవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కొనసాగుతోందన్నారు. చేర్యాల ప్రజలు డివిజన్ స్థాయి పనులకు పలు దిక్కులకు వెళ్లడం వల్ల ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో హరీష్ రావు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సోనియాగాంధీని ఒప్పించి తెచ్చిన దానిలో తన పాత్ర ఉందని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని 100% అమలు చేయడం కోసం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కృషి చేస్తున్నారన్నారు. రేషన్ కార్డులు,పెన్షన్లు ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. గతంలో ఎంపీగా ఉన్న రోజుల్లో ప్రతి గ్రామానికి మంచినీళ్లు కోసం బోరులు వేయడం జరిగిందని.. అలాగే వృద్ధులకు ఉచిత అనాథ ఆశ్రమం నిర్మించానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు.

# ఆంధ్రా ప్రయాణం మస్తు పిరం.. వేసవి సెలవులు, ఎన్నికలతో పెరిగిన రద్దీ



హైదరాబాద్: వేసవి సెలవులు, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చాలా మంది హైదరాబాద్ నుంచి తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ముఖ్యంగా ఏపీలో ఓట్ల తేదీ సమీపిస్తుండటంతో కుటుంబ సమేతంగా వెళుతున్నారు. దీంతో బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. బుకింగ్ చేసుకోవడానికి కూడా నెల రోజుల వరకు టికెట్లు దొరకని పరిస్థితి ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చాలా మంది జనం ట్రావెల్ బస్సులను ఆశ్రయిస్తున్నారు.

ఇదే అదునుగా భావించిన కొన్ని ట్రావెల్స్ రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రూ.800 ధర ఉంటే సుమారు 2వేల పైనే వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. రైల్వే, ఆర్టీసీ అధికారులు ఏపీకి ప్రత్యేక రైళ్లు, బస్సు సర్వీసులను పెంచాలని ప్రయాణికులు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సుల్లో సీట్లను ఏర్పాటు చేసి ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. అధిక డబ్బులు వసూలు జేస్తున్న ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు




అమరావతి: ఏపీ, తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ ఉపసంహరణ గడువు ముగిసింది. అభ్యర్థుల తుదిజాబితాను రిటర్నింగ్ అధికారులు మరికాసేపట్లో విడుదల చేయనున్నారు. ఏపీలోని 175 శాసనసభ నియోజకవర్గాలకు మొత్తం 4,210 నామినేషన్లు, 25 లోక్‌సభ నియోజకవర్గాలకు 731 నామినేషన్లు దాఖలయ్యాయి. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు గానూ 625 నామినేషన్లు నమోదయ్యాయి. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660